
సాక్షి
ప్రకాశం
సోమవారం | 24 | ఏప్రిల్ | 2023



దళితులపై దాడులు హేయం

టీడీపీ నాయకులు దళితులపై రాళ్లదాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. - 8లో..



అకాల వర్షం..ఉద్యాన పంటలకు నష్టం

జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యంగ్ సైంటిస్ట్ శిక్షణకు మంగమూరు జెడ్పీ విద్యార్థి ఎంపిక



యంగ్ సైంటిస్ట్ శిక్షణకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో పి.రమేష్

ఒంగోలు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించనున్న యంగ్ సైంటిస్ట్ శిక్షణ (యువికా)కు మంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అబ్బూరి నవీన్ ఎంపికయ్యారు. మే 14 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో ఈ శిక్షణ ఉంటుంది. యువికా కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ యువ విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ , స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్లపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించేందుకు, యువతలో సైన్స్ అండ్ టెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న ధోరణుల గురించి అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా మంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి అభ్యసిస్తున్న అబ్బూరి నవీన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్‌మేరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుధాకరరావు, సైన్స్ ఉపాధ్యాయులు టి.రమేష్, సీహెచ్ అన్నపూర్ణాదేవి అభినందించారు.

పూంఛ్ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న మాజీ సైనికులు


ఒంగోలు: పూంఛ్ అమరవీరులకు స్థానిక మిలిటరీ క్యాంటీన్ వద్ద మాజీ సైనికులు ఘన నివాళి అర్పించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు, గులాబీలు ఉంచి నివాళులర్పించారు. జమ్మూకాశ్మీర్‌లో పూంఛ్ సెక్టార్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సైనికుల ట్రక్కుపై ఉగ్రవాదులు జరిగిన దాడిలో ఐదుగురు సైనికులు అమరులైన విషయం విదితమే. ఈ సందర్భంగా ఏపీ డిఫెన్స్ వెటరన్ అసోసియేషన్ అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ సైనికుల త్యాగం వృథా కాదన్నారు. దేశం వీరి అత్యున్నత త్యాగాన్ని మరువలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు సంఘం నాయకుల ఆలపాటి వెంకటేశ్వర్లు, దర్శి కోటేశ్వరరావు, జి.వెంకట్రావు, టి.వెంకటేశ్వర్లు, అంజయ్య, సాధినేని సుబ్బారావు, డీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీని సాగనంపితేనే విశాఖ ఉక్కును కాపాడుకోగలం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్



ఒంగోలు: ప్రధాని నరేంద్రమోదీని సాగనంపితేనే విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడం సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది బలిదానంతో, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలతో, ప్రజా ఉద్యమాలతో విశాఖ ఉక్కు ఏర్పడిందన్నారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. రెండు సంవత్సరాలుగా విశాఖ ఉక్కు కార్మికులు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయవద్దంటూ ఉద్యమిస్తున్నారని, కేంద్రంలోని బీజేపీ మాత్రం ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు ఉవ్విళ్లూరుతోందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు మే 3న రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో కలిసి కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రాస్తారోకోలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 27న సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగే ప్రచార భేరీ బహిరంగసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 25న కలెక్టరేట్ ఎదుట రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ అమరావతి జేఏసీ నిర్వహించే ధర్నాలలో ఏఐటీయూసీ కార్మికులు విరివిగా పాల్గొంటారన్నారు. సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి మాట్లాడుతూ మే డే కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాలలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ ఒంగోలు నగర అధ్యక్షుడు కె.అంజయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌డీ సర్దార్, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాతాశిశు సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, చిన్నారులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సొంత భవనాలు, కరెంటు వసతి ఉన్న చోట ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సొంత భవనాలున్నచోట సగానికిపైగా కేంద్రాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఒక్కో ప్లాంట్ కోసం రూ.24 వేలు ఖర్చు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు శుద్ధజలం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సురక్షిత తాగునీరు
- శాశ్వత భవనాలు ఉన్న వాటికి తొలి ప్రాధాన్యత
- ఒక్కొక్క ప్లాంట్‌కు రూ.24 వేలు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో మొదటి విడతగా 257 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: **13**

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: **2903**

స్వంత భవనాలున్నవి: **1158**

అద్దె భవనాలు: **1153**

ప్రైవేటు ఉచిత భవనాలు: **592**

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు: **227**

0-6 సంవత్సరాల పిల్లలు: **1,41,386** మంది

గర్భిణులు: **14,437** మంది

బాలింతలు: **15,274** మంది

పొదిలి రూరల్:

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. మాతాశిశు సంరక్షణ కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాలతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందించడం లాంటి కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో తల్లులు, చిన్నారుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీరు అందుబాటులో ఉండేలా ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మధ్యాహ్న భోజన సమయాన శుద్ధ జలంతో లబ్ధిదారుల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తద్వారా కలుషిత నీరు తాగకుండా ఈ ఆర్వోప్లాంట్ల నుంచి నీటిని అందించనున్నారు.

జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా, వాటి కింద 2903 అంగన్‌వాడీ కేంద్రాలు, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వాటిలో స్వంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలు 1158 ఉండగా, అద్దె భవనాలు 1153 ఉన్నాయి. మిగిలినవి 592 ప్రైవేటు ఉచిత భవనాలు. ఆయా కేంద్రాల్లో 0-6 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 1,41,386 మంది ఉన్నారు. గర్భిణులు 14,437 మంది, బాలింతలు 15274 మంది ఉన్నారు. అయితే మొదటి విడతగా స్వంత భవనాలు, కరెంట్ సదుపాయాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు 257 కేంద్రాలకు ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 130 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయగా, మిగిలిన 127 కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ ఈ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను ఐదేళ్లపాటు సంబంధిత కంపెనీలే తీసుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. త్వరలోనే అన్ని కేంద్రాలకు ప్లాంట్ల ఏర్పాటు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంటు

దశల వారీగా అన్ని కేంద్రాల్లో ఏర్పాటు



జిల్లాల్లో సొంత భవనాలు, కరెంట్, నీటి వసతి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. మొదటి విడతగా జిల్లాకు 257 ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 130 ఆర్వో ప్లాంట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు అమర్చగా, మిగిలిన 127 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. దశల వారీగా అన్ని కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. పిల్లలకు, గర్భిణులకు సురక్షిత తాగునీరు అందిస్తాం.

– వై ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

ఒక్కో ఆర్వో ప్లాంట్‌కు రూ.24 వేలు ఖర్చు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మినీ ఆర్వో ప్లాంట్‌కు సంబంధించి ఒక్కొక్క ప్లాంట్‌కు రూ.24 వేలు చొప్పున ఖర్చు చేయనున్నారు. 15 లీటర్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ఇది గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. ఇక్కడ నీటి సదుపాయం ఉంటే పైపుల ద్వారా ప్లాంట్లకు నీరు నింపి శుద్ధి చేస్తారు. నీటి సదుపాయం లేని చోట నీరు తీసుకొచ్చి ఆర్వో ప్లాంట్‌లో పోసి శుద్ధి చేసిన తరువాత ఉపయోగించుకొనేలా చర్యలు తీసుకుంటున్నారు.

అభ్యుదయ కవిత్వ లక్ష్యం మెరుగైన సమాజం

- గురజాడ చెప్పిన హితవును మనకన్నా చైనావారే ఎక్కువగా ఆచరిస్తున్నారు
- ఏకేయూలో తెలుగు విభాగం ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా
- ప్రపంచీకరణ నేపథ్యంలో అభ్యుదయ వాదులపై ఎంతో బాధ్యత ఉంది
- శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణ



డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణను సత్కరించి పురస్కారం అందిస్తున్న ఏకేయూ ఉపకులపతి మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: అభ్యుదయ కవిత్వ లక్ష్యం మెరుగైన సమాజం, మెరుగైన దేశం, మెరుగైన జీవితం అని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణ అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు భీమనాథం హనుమారెడ్డి 82వ జయంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభ్యుదయ కవిత్వం గురించి వివరిస్తూ సామాజిక ఛాందసత్వంపై కందుకూరి వీరేశలింగం పంతులు, భాషాఛాందసంపై గిడుగు రామమూర్తి పంతులు, సాహిత్య ఛాందసంపై గురజాడ అప్పారావు లాంటి వారు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. నాటకాలు, నాటికలు, సాహిత్యం, స్వీయరచనలు, నవలలు వంటి వాటి ద్వారా ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. ఉత్పత్తులు పెంచాలి...ఎల్లలు దాటించి మరీ వాటిని అమ్మాలి అని గురజాడ సూచిస్తే దానిని చైనీయులు చక్కగా పాటిస్తున్నారన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా చైనా ఉత్పత్తుల వెల్లువే కనిపిస్తుందన్నారు. ఇండియా కూడా ఆ స్థాయికి చేరాల్సిన అవసరాన్ని ఎలుగెత్తుతూ అభ్యుదయ కవులు తమ కలాలకు పదును పెట్టాలన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు భీమనాథం హనుమారెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఆయన 82వ ఏట ఆయన స్మారక పురస్కారాన్ని తనకు ప్రకటించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ భీమనాథం హనుమారెడ్డి ఒక లీడింగ్ లాయర్‌గా, మరో వైపు లీడింగ్ రచయితగా రాణించడం అంటే అది ఆయనకు దేవుడిచ్చిన బహుమతిగా పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఏర్పాటు చేయాలా? వద్దా? అనే మీమాంస తనలో ఉందని, అందుకు కారణం విద్యార్థులు చేరిక తక్కువగా ఉంటుందని తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. అయితే ఇంతమంది కవులు, కళాకారులను చూసిన తరువాత తప్పకుండా తెలుగు విభాగాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కవులు, కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ అభ్యుదయ కవిత్వం నాడు-నేడు అనే అంశంపై చక్కని ఉపన్యాసాన్ని అందించారంటూ డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణను కొనియాడారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకోవడానికి హనుమారెడ్డి జయంతి వేదిక కావడం ఆనందంగా ఉందని, తప్పకుండా విశ్వవిద్యాలయంలో సీట్లన్నీ భర్తీ అయ్యేలా తాము బాధ్యత తీసుకుంటామని ప్రకటించారు. అనంతరం డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణకు భీమనాథం హనుమారెడ్డి స్మారక పురస్కారంతోపాటు రూ.10 వేల నగదు బహుమతి అందించారు. అనంతరం పలువురు కళాకారులు, కవులు, రచయితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతపేట సాయిబాబా మందిరం అధ్యక్షుడు అశోహరి చెంచలరావు, నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, జానపద కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు.దేవపాలన, ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా రాజకీయాల్లో ఎదుగుదాం



ప్రగడ కోటయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయ లక్ష్మి

- ప్రజాబంధు ప్రగడ కోటయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

చీమకుర్తి: పద్మశాలీయులంతా కలిసికట్టుగా పనిచేసి రాజకీయాల్లో ఎదుగుదామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయ లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం చీమకుర్తి చేనేత సొసైటీ భవనం వద్ద పద్మశాలీయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాబంధు, మాజీ రాజ్యసభ సభ్యుడు ప్రగడ కోటయ్య విగ్రహావిష్కరణకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీయులంతా ఐక్యంగా ఉండటం ద్వారా మన హక్కులను సాధించుకోవచ్చన్నారు. చీమకుర్తి పట్టణంలో 1300 కుటుంబాలకు పైగా ఉన్న పద్మశాలీయులు ఒక్కతాటిపైకి వచ్చి చేనేత బంధు ప్రగడ కోటయ్య విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. చేనేత వృత్తినే నమ్ముకొని ఉన్న పద్మశాలీయులకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని వారు భరోసా ఇచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రగడ కోటయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగడ కోటయ్య కుమారుడు ప్రగడ వెంకట శేష శయన్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొండా వెంకట మోహన్ రావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు అవ్వారు ఆదినారాయణ, కౌన్సిలర్‌లు సామా శేషాద్రి, గోపురపు రాజ్యలక్ష్మి, చంద్ర, కొత్రపు రాఘవరావు, ఎన్.హరిప్రసాద్, పుల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



సంచారుల 'సెల్'చల్

చేతుల్లో సెల్‌ఫోన్లతో ప్రపంచాన్ని మరిచిపోయిన వీరంతా సంచారజాతులకు చెందిన వారు. నిరక్షరాస్యులైన వీరు ఆటవిడుపుగా సెల్‌ఫోన్ గేమ్స్‌తో కుస్తీ పడుతుంటారు. ఒంగోలు కొత్తమార్కెట్ సెంటర్ ఫుట్‌పాత్‌పై నివసించే వీరు ఆదివారం ఇలా తలో సెల్లు చేతబట్టి 'సెల్'చల్ చేస్తున్నారు.

ఫొటోలు: ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు



ఉద్యోగులందరూ ప్రభుత్వానికి సమానమే



ఏపీ జీఈఎస్‌ఏ సమావేశంలో మాట్లాడుతున్న వినుకొండ రాజారావు

- నాయకుల ఓడీలను, బదిలీల్లో వెసులుబాటును రద్దు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సర్వీస్ అసోసియేషన్ డిమాండ్

ఒంగోలు టౌన్: ప్రభుత్వానికి ఉద్యోగులందరూ సమానమేనని, ఉద్యోగులు ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి కోరుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు అన్నారు. ఆదివారం ఒంగోలులోని సంఘం కార్యాలయం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కాపాడుతామని ఉద్యోగుల హక్కులతో ఆటలాడుకున్న నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి నానా ఫీట్లు చేస్తున్నారని విమర్శించారు. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిపెట్టుకున్న సంఘాల నాయకుల ఓడీలను, బదిలీల్లో వెసులుబాటును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ఉద్యోగులందరికీ ఒకే విధమైన అవకాశాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు విజయేందర్ రావు, శ్రీనివాసులు, మురళి, సుదర్శన్ రావు, కోటిరెడ్డి, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో కళ్లంలో మిర్చిని కాపాడుకునేందుకు పరదాలు కప్పుతున్న రైతులు



పసుపుగల్లులో నేలరాలిన మిరప కాయలు చూపిస్తున్న రైతు శ్రీనివాసరెడ్డి



తాళ్లూరులో కురుస్తున్న వడగండ్లు

అకాల వర్షం.. ఉద్యాన పంటలకు నష్టం



తాళ్లూరు : కొత్తపాలెంలో దెబ్బతిన్న అరటి తోట



ఆర్.లక్ష్మీపురంలో కూలిన పొగాకు బ్యారన్



చిమటలో ట్రాక్టర్‌పై పడిన విద్యుత్ స్తంభం

- ఈదురుగాలుల దెబ్బకు అరటి, మిర్చి తోటలు ధ్వంసం
- కళ్లాల్లో మిరపకాయలు తడవడంతో రైతుల ఆవేదన
- విద్యుత్ స్తంభాలు కూలడంతో పలు గ్రామాల్లో అంధకారం

సాక్షి నెట్‌వర్క్: భీకర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆదివారం సాయంత్రం జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షం కురవడంతో ఉద్యాన పంటలైన అరటి, మిర్చి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలుల ధాటికి పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

☛ ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు, ఉమామహేశ్వరపురం, రమణారెడ్డిపాలెం, పూరిమెట్ల, తమ్మలూరు, నాయుడుపాలెం గ్రామాల్లో కల్లాల్లో మిర్చిని కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడ్డారు. కోతకు సిద్ధంగా ఉన్న మిరప తోటలు ఈదురుగాలులు, వడగండ్ల వానకు దెబ్బతిన్నాయి. ఈదర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

☛ తాళ్లూరు మండలంలో మిరప, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. కొత్తపాలెంలో రైతు కోట సుబ్బారెడ్డికి చెందిన అరటి తోట గాలివానకు ధ్వంసమై రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లింది. బొద్దికూరపాడులో పూరిళ్ల పైకప్పు గాలికి ఎగిరిపోయాయి. నాగంబొట్లపాలెంలో వడగండ్లు పడటంతో చిన్నారి తలకు గాయమైంది. భారీ పరిమాణంలో ఉన్న వడగండ్లు పడటంతో పశువులు, జీవాలు పరుగులు తీశాయి.

☛ మర్రిపూడి మండలంలోని కాకర్ల, చిమట, కొత్తూరు, శివరాయునిపేట గ్రామాల్లో 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిమటలో ఎల్‌టీ విద్యుత్ స్తంభం విరిగి ట్రాక్టర్‌పై పడింది.

☛ సంతనూతలపాడు మండలం ఆర్.లక్ష్మీపురంలో మాజీ సర్పంచ్ కొండ్రాజు యోగయ్యకు చెందిన పొగాకు బ్యారన్ గోడలు కుప్పకూలాయి. రూ.3.50 లక్షల మేర నష్టం వాటిల్లింది.

☛ సింగరాయకొండ మండలంలో సాయంత్రం 5 నుంచి సుమారు గంటసేపు వర్షం కురిసింది. చెరువులకు సమృద్ధిగా నీరు చేరిందని రైతులు చెబుతున్నారు.

☛ కొండపి మండలంలోని చిన వెంకుపాలెం గ్రామంలో రెండు స్తంభాలపై పింగాణి పగిలిపోయి వైర్లు జారడంతో కొండపి, పెట్లూరు, మర్రిపూడి మండలం జువ్విగుంట సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.



నాగంబొట్లపాలెంలో వడగండ్ల ధాటికి గాయపడిన చిన్నారి

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం



అంబడిపూడిలో షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన మొక్కజొన్న పొలాలు

- 30 ఎకరాలు అగ్నికి ఆహుతి
- లబోదిబోమంటున్న రైతులు

బల్లికురవ: ఆరుగాలం కష్టించి పంట పండించగా చేతికందే దశలో అందకపోతే ఆబాధ వర్ణనాతీతం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సుమారు 30 ఎకరాల్లోని మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని అంబడిపూడి గ్రామ సమీపంలోని పొలాల్లో జరిగింది. రైతులు అందించిన సమాచారం ప్రకారం.. అద్దంకి వెళ్లే రోడ్డుకు తూర్పు భాగంలో చినఅంబడిపూడి, పెదఅంబడిపూడి గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ బోర్లు, మోటార్లు, విద్యుత్ కనెక్షన్‌ల ద్వారా పంటలు పండిస్తున్నారు. రెండేళ్లుగా మొక్కజొన్నకు గిరాకీ ఉండటంతో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగును చేపట్టారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు పైరు నేలవాలింది. రెండు మూడు రోజుల్లో కండెలు పక్వానికి వచ్చి కోసుకుందామనుకుంటున్న రైతులకు షార్ట్ సర్క్యూట్ రూపంలో తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. గంగవరపు హనుమంతరావు పొలంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న కిలారు చంద్రమౌళి, దర్శి వీరయ్య, పల్లె లింకన్, అర్వపల్లి శ్రీనివాసరావు, మరో పదిమంది రైతుల పొలాల్లో మంటలు వ్యాపించి సుమారు 30 ఎకరాల్లో పైరు పూర్తిగా దగ్ధమైంది. ఎకరా పంట సాగుకు రూ.50 వేలవరకు పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు వాపోయారు. పంటలను అదుపులోకి తెచ్చేందుకు అద్దంకి అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రం పొలాల వద్దకు రాగానే ఆకాశం మేఘావృతంతో జల్లులు కురవటంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

బాలికపై లెంగిక వేధింపులు

- ప్రైవేట్ స్కూల్ డైరెక్టర్‌పై కేసు నమోదు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినిని అదే పాఠశాలకు చెందిన ఓ డైరెక్టర్ లైంగిక, మానసిక వేధింపులకు గురిచేయడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పాఠశాలలో చదువుతున్న బాలిక తరచూ అనారోగ్యానికి గురవుతోంది. తల్లి విచారించగా ఆ బాలిక ఆవేదనతో అసలు విషయం తెలియజేసింది. పాఠశాలకు చెందిన డైరెక్టర్ కమ్ సబ్జెక్ట్ టీచర్ మారం రమణారెడ్డి గత కొన్ని నెలలుగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు తల్లికి, బంధువులకు తెలిపింది. ఇదే విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్‌కు తెలిపినా ఫలితం లేకపోవటంతో బాలిక బంధువులు రమణారెడ్డిపై దాడి చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద నిందితుడిపై శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. నిందితుడిపై దాడి చేసిన బాలిక బంధువు నాగార్జునపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

దళితులపై దాడులు హేయం

- మంత్రి సురేష్‌ను చంద్రబాబు బెదిరించడం సరికాదు
- వైపాలెంలో దళితులపై రాళ్లదాడిని ఖండిస్తున్నాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

మార్కాపురం: వైపాలెం పర్యటనలో మంత్రి సురేష్‌కు మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు వేళ్లు చూపిస్తూ బెదిరించడాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ ఖండించారు. ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకొనే చంద్రబాబు.. 'దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా' అని గతంలో వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. టీడీపీ హయాంలో అప్పటి మంత్రి ఆదినారాయణ, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూడా దళితులను హేళన చేస్తూ మాట్లాడారన్నారు. 1985లో టీడీపీ అధికారంలో ఉండగా కారంచేడులో మాదిగలను ఊచకోత కోసి దళితులపై దాడులకు పురిగొల్పింది ఎవరని ప్రశ్నించారు. దళిత మంత్రి సురేష్‌కు చంద్రబాబునాయుడు వేళ్లు చూపి బెదిరిస్తూ, హెచ్చరిస్తూ మంత్రి కార్యాలయంపై రాళ్లదాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి సురేష్‌కు చంద్రబాబు క్షమాపణ చెప్పి వైపాలెం నియోజకవర్గంలోకి ప్రవేశించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దళితులు, గిరిజనులు, మహిళలపై హత్యాచారాలు, దాడులు లాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ కల్పిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తారా అని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పానుగంటి షాలేంరాజ్, ఎం.పీటర్, వినయ్, జయరాజ్, డి.మోషే, రమేష్, నాగలక్ష్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు తోట దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం
- పామూరు మండలం నుచ్చుపొదలో ఘటన



దగ్ధమవుతున్న వెదురుతోట

పామూరు: ప్రమాదవశాత్తు వెదురుతోట దగ్ధమైన ఘటన మండలంలోని నుచ్చుపొద రెవెన్యూ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సుమారు రు.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. వివరాలు.. పామూరుకు చెందిన గూడూరు వెంకటనర్సయ్యకు నుచ్చుపొద రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 68, 69లో ఆరు ఎకరాల్లో వెదురు సాగు చేస్తున్నారు. వెంకట నర్సయ్య కుమారుడు శేషగిరిరావు మధ్యాహ్నం సమయంలో తోటలో నీరుపెడుతున్నాడు. ఇంతలో వెదురు తోటలోంచి దట్టమైన పొగలు రావడం గమనించి దగ్గరకు వెళ్లి చూడగా మంటలు చెలరేగుతున్నాయి. ఫైర్ ఇంజిన్ వచ్చేసరికే నష్టం జరిగిపోయిందని, వెదురుతోటను ఐదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నామని శేషగిరిరావు కన్నీటిపర్యంతమయ్యారు. తోటలో గుండా వెళ్తున్న విద్యుత్ తీగలు వెదురు చెట్లకు తగిలి నిప్పురవ్వలు పడ్డాయా? లేదా ఆకతాయిల పనా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై వీఆర్‌ఓకు సమాచారం ఇచ్చామని తెలిపారు. కాగా ఫైర్ సిబ్బంది కష్టించి మంటలను పక్క పొలాలకు వ్యాపించకుండా ఆర్పేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన సుభాని



కారును పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయలాయ్యాయి. ఈ సంఘటన ఆదివారం అనంతపురం–అమరావతి హైవే రోడ్డుపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన మెకానిక్ షేక్ సుభాని (38), స్నేహితుడు సుభానితో కలిసి కంభం నుంచి ద్విచక్రవాహనంపై మార్కాపురం వెళ్తుండగా అదే సమయంలో కంభం నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో షేక్ సుభాని(38) తీవ్ర గాయాలు కాగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా మరొక యువకుడికి గాయలయ్యాయి. కారును మహిళ నడుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి ఏఎస్సైకి తీవ్ర గాయాలు



గాయపడిన ఆదిమంత్రునాయక్

పెద్దారవీడు/మార్కాపురం టౌన్: స్కూటీ అదుపుతప్పి ఏఎస్సై తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దారవీడు మండలం గొబ్బూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పుల్లలచెరువు మండలం నెరజాముల తండా గ్రామానికి బి.ఆదిమంత్రునాయక్ మార్కాపురం రూరల్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. మార్కాపురం నుంచి స్కూటీపై స్వగ్రామానికి వెళ్తున్న ఆయన గొబ్బూరు శివాలయం సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు. కాగా సంఘటనా స్థలంలో పడిపోయిన రూ.17,500 నగదు, బంగారు చైన్, మొబైల్ ఫోన్‌ను 108 సిబ్బంది సుబానీ, మల్లయ్య మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. 108 సిబ్బందిని పోలీసులు అభినందించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

రూ.2 లక్షల విలువైన 16 సెల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొండయ్య

చీరాల రూరల్: రైళ్లల్లో తిరుగుతూ ఆదమరచి నిద్రించే ప్రయాణికుల వద్ద సెల్‌ఫోన్లు అపహరిస్తున్న నిందితుడిని చీరాల రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనున్న రూ. 2 లక్షల విలువైన వివిధ రకాల కంపెనీలకు చెందిన 16 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ వీ శ్రీనివాసరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. చీరాల విఠల్‌నగర్‌లోని శ్మశాన వాటిక సమీపంలో నివాసముండే (తమిళ) అర్ముగం విజయ్ అనే వ్యక్తి చీరాల–ఒంగోలు రైల్వే స్టేషన్ల మధ్యలో గల రైళ్లల్లో ప్రయాణికుడి మాదిరిగా సంచరిస్తుంటాడు. ఈ క్రమంలో రద్దీగా ఉండే సమయాల్లో ప్రయాణికులు ఆదమరచి నిద్రించే సమయాలను గుర్తించి వారివద్దనున్న సెల్‌ఫోన్లను తస్కరిస్తుంటాడు. సెల్‌ఫోన్లు విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ తిరుగుతుంటాడు. అతనిపై నిఘాఉంచి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడిని రైల్వే స్టేషన్ దక్షిణం వైపున జీఆర్పీ ఎస్సైసీహెచ్. కొండయ్య అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. నిందితుడిని రిమాండుకు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

26న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోటలో కోటా గంగాభవాని అమ్మవారి దేవాలయ తృతీయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఈ నెల 26 తేదీ బుధవారం రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు బుధవారం ఉదయం 6:30 గంటల లోగా ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించి తమ ఎడ్లజతల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎడ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.70 వేలు, మూడో బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతిగా రూ.20 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9703369948, 9010568004 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్రగాయాలు



విద్యుత్ షాక్ గురైన లక్ష్మీ శ్రీధర్‌రెడ్డి

రాచర్ల: ఇంటి పైకప్పుపై ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి బాలుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని సోమిదేవిపల్లెలో జరిగింది. వివరాల్లోకి వెళితే..సోమిదేవిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మి శ్రీధర్‌రెడ్డి అనే యువకుడు తన ఇంటిపై ఆడుకుంటున్న సమయంలో ఇంటిపై నుంచి వెళుతున్న హెచ్‌డీ విద్యుత్‌లైన్‌కు ప్రమాదవశాత్తు బాలుడు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కరెంట్‌ను నిలిపివేసి వెంటనే 108 వాహనంలో గిద్దలూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించి వైద్యం అందిస్తున్నట్లుగా స్థానికులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రైల్వేట్రాక్ పై పడి వున్న మృతదేహం

కురిచేడు: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి చెందాడు. ఈ సంఘటన కురిచేడు–గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 55 ఏళ్ల వయసున్న వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి మృతి చెంది ఉన్నాడు. మృతుని చేతిపై గణేశుని బొమ్మ పచ్చబొట్టుతో ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పల్నాడు జిల్లా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు రైల్వే పోలీసులు 9542424899, 9948525386 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేవీఎస్, ఎన్‌వీఎస్ పరీక్షల్లో ఒంగోలు వాసుల సత్తా



ఆంజనేయులు



లక్ష్మీరెడ్డి

ఒంగోలు టౌన్: ఆలిండియా స్థాయిలో కేవీఎస్(కేంద్రియ విద్యాలయ సమితి) ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ విభాగంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఎంపికకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ఒంగోలు నగరం అంజయ్య రోడ్డులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థి వి.ఆంజనేయులు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు ఆ సంస్థ కరస్పాండెంట్ కె.మోహన్‌రావు, డైరక్టర్ పి.వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎన్‌వీఎస్(నవోదయ విద్యాలయ సమితి) ఫలితాల్లో పీవీ లక్ష్మీరెడ్డి జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

గ్రూప్ ఫైరింగ్ టీం ఎంపికలో విద్యార్థుల ప్రతిభ



ఫైరింగ్ టీంకు ఎంపికైన క్యాడెట్లు

చీరాల టౌన్: గ్రూప్ ఫైరింగ్ టీం ఎంపికలో చీరాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 21, 22 తేదీల్లో స్థానిక 23వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఎంపిక పోటీలు ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఈఎంపికలో వీఆర్‌ఎస్, వైఆర్‌ఎన్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గుంటూరు–ప్రకాశం–నెల్లూరులలో గల దాదాపు 10 బెటాలియన్స్ 100 మందికి పైగా కాడేట్స్ ఈ క్యాంప్‌కు హాజరయ్యారు. సీనియర్ డివిజన్ విభాగంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాలాని ఆదిత్య, సూరగాని పవన్ కుమార్లు ఎంపికవ్వగా, సీనియర్ వింగ్ విభాగంలో రొంపిచెర్ల హర్షిత, పేర్లి పరమజ్యోతి రిజర్వ్ కోటలో ఎంపికయ్యారు. ఎంపికైన క్యాడెట్స్ వచ్చే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో జరిగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాంప్‌లో పాల్గొంటారని కళాశాల ఎన్సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కారెస్పాండెంట్ అద్దగడ వేణుగోపాల్, 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో 23వ ఆంధ్ర బెటాలియన్ నుంచి సుబేధార్ మేజర్ సత్యేంద్ర, సుబేదార్లు బల్బీర్ సింగ్, లక్ష్మణ్ సింగ్, హవల్దార్లు రమేష్, సుభాష్, జైవీర్, గాలయ్య క్యాడెట్స్ పాల్గొన్నారు.